సముద్ర విహారానికి
వెళ్ళిన
ఆ ముగ్గురి
అనుభవం?

# కె.ఆర్.కె. మోహన్ కథ

# నలభై ఎనిమిది గంటలు

"ఏమోయ్.... నీకో గుడ్‌న్యూస్...." అంటూ వచ్చాడు ప్రకాశం

"ఏమిటది?" అంది నిర్మల ఉత్సాహంగా

"అనిల్ కూడా రానీ... ఒకేసారి చెప్తా" అంటూ ఊరించాడు ప్రకాశం

"ఇక్కడే ఉన్నాను నాన్నగారు" అంటూ గదిలోంచి వచ్చాడు అనిల్.

"ఇంక మీ సస్పెన్స్ ఆపి సంగతేమిటో చెప్పండి" అంది నిర్మల.

"అఫీషియల్ డ్యూటీమీద పదిరోజులు అండమాన్స్‌కి వెళ్తున్నానోయ్"

"అండమాన్సా! ఆజన్మఖైదీలను అండమాన్స్‌కి పంపుతుండేవారట వెనకటి రోజుల్లో. అక్కడికి వెళ్లడం మీకు గుడ్ న్యూసా.. భలేవారే" అంది నిర్మల నిరుత్సాహంగా.

"అదంతా స్వాతంత్ర్యం రాకపూర్వం నాటిమాట. ఈనాడు అండమాన్స్ గొప్ప పిక్నిక్ స్పాట్. అంతేకాదు. ఆనాడు లోకమాన్య తిలక్, వీర్‌సావర్కార్ వంటి మహనీయులను ఉంచిన జైలు కూడా పవిత్రమైన యాత్రా స్థలమే."

"నాన్నగారు... అండమాన్ నికోబార్ దీవులు చాలా అందంగా ఉంటాయిట కదా అన్ని వైపులా సముద్రం, ఎటు చూసినా కొబ్బరి చెట్లు, రబ్బరుచెట్లు, టేకు చెట్లు ఉండి ఎంతో అందంగా ఉంటాయటకదా!'

"నిజమే. అయితే ఇదంతా జనవాసాలతో సేద్యం చేస్తుండే చోటు. అసలు నరమానవుడంటూ లేని ద్వీపాలు కొన్ని ఉందయిన్నాయి. వాటిమీద దట్టమైన అడవులు— కాలు పెట్టడానికే కష్టంగా ఉంటుంది.



కొన్ని ద్వీపాలలో ఇప్పటికీ అసలు నాగరికత ఏ మాత్రం తెలియని ఆదిమజాతులవారు న్నారు. ఇతర జాతుల మనుష్యులు కంటబడితే వారిని ప్రాణాలతో వదిలిపెట్టరు. మరికొన్ని ఆదిమ జాతులవారు నరమాంస భక్షకులు కూడాను."

"అఘోరించినట్లుంది. ఇటువంటి చోటికి వెళ్ళడం గుడ్‌న్యూసా?" అంది నిర్మల

మళ్ళీ చికాకుపడుతూ.

"నేను చెప్పినవన్నీ జనవాసాలు లేకుండా దట్టమైన అడవుల మధ్యనవుండే వాటిని గురించి. ఇప్పుడు అండమాన్స్‌లో మన తెలుగువారితో సహా లక్షల మంది భారతీయులు ఉన్నారు. పిక్నిక్ పెట్టుకుంటే ప్రకృతి సౌందర్యం పరవళ్ళు తొక్కే అటువంటి చోటికే పెట్టుకోవాలి.

"అందువల్ల మనందరం అక్కడికి పోదాం."

"అంతదూరం వెళ్ళాలంటే బోలెడు ఖర్చుకాదూ?" అంది నిర్మల.

"వెళ్ళి రావడానికి వారం పదిరోజులు పడ్తుంది కదా! మరి నా స్కూల్ పోదూ?" అన్నాడు అనిల్ దిగులుగా.

"నేనెలాగూ అఫీషియల్ డ్యూటీమీద వెళ్తున్నాను. మీ ఇద్దర్నీ ఎల్.టి.సి మీద తీసుకువెళ్తాను. దీంతో ప్రయాణఖర్చులు కలిసివస్తాయి. పైఖర్చులు ఎక్కడికిపోయినా తప్పవు."

"మరి..."

"అ... అ... నీ స్కూల్ సంగతే చెప్పబోతున్నాను. వెళ్ళేటప్పుడు విమానంలో వెళ్దాం. వచ్చేటప్పుడు ఓడలో వద్దాం. రెండూ చూసినట్లుంటుంది. నీకెలాగూ దసరా సెలవులే కదా... మహా అయితే మరో నాలుగైదురోజులు సెలవు పెడ్తువుగాని.

"కాని ఇంకా వర్షాకాలం పోలేదు. వెళ్ళిందగ్గర్నుంచీ వచ్చేవాన, పోయేవానగా ఉందంటే పిక్నిక్‌కి వెళ్ళిన తృప్తి ఉండదు" అంది నిర్మల.

"నువ్వన్నది నిజమేకాని ప్రకృతి అందాలు చూడాలంటే వర్షాకాలంలోనే చూడాలి. ఎటు చూసినా పచ్చదనం— పొంగి పొరలే సెలయేర్లు, ఎగసిపడే సముద్రం— పిక్నిక్‌ని పూర్తిగా ఎంజాయ్ చేయాలంటే ఇటువంటప్పుడే వెళ్ళాలి. ఇక వానలంటావా? అవి అడపాతడపా కురుస్తూనే ఉంటాయనుకో. ఎడతెరిపి లేకుండా కాదుగా! ఇంక అనుమానాలు పెట్టుకోకుండా ప్రయాణానికి సిద్ధం కా. ఇంక వారమే ఉంది" అన్నాడు ప్రకాశం.

* * *

విమానం మద్రాసులో బయలుదేరి అండమాన్స్ ముఖ్యపట్టణమైన పోర్ట్‌బ్లయిర్ చేరింది. విమానం కొంతదూరం వెళ్ళాక ఎటుచూసినా సముద్రమే తప్ప భూమి అంటూ కనిపించలేదు. ఒక ప్రక్కన చెప్పలేని ఆనందం. మరో ప్రక్కన చెప్పుకోలేని భయం— అంతా థ్రిల్లింగ్‌గా వుంది.

మన నగరాలతో పోలిస్తే పోర్ట్‌బ్లయిర్ చిన్న పట్టణమే. అండమాన్స్‌ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ప్రభుత్వం అక్కడికి వలసపోదలచుకున్న వారికి భూముల్ని, నివాస స్థలాల్ని ఇచ్చి అనేక సదుపాయాలు కల్పించింది. దాంతో భారతదేశంలోని అనేక మంది ప్రజలు ముఖ్యంగా దక్షిణాదివారు, బెంగాలీలు, బీహారీలు అక్కడికి వలసపోయారు. ఫలితంగా అది మినీ ఇండియావలె తయారయింది.

అయితే అందరికీ కామన్ భాష ఒకటే ఉండాలి కనుక హిందీ, ఇంగ్లీష్ బయట వినిపించే భాషలయ్యాయి. ఆ తర్వాత ఎక్కువగా వినిపించేవి బెంగాలీ, తమిళం,

తెలుగు, మళయాళ భాషలు. అక్కడివారు భారతీయులే అయినా మెయిన్‌లాండ్ నుంచి వందల మైళ్ల దూరాన, అది కూడా సముద్రానికి ఆవల ఉండడంతో వేరే దేశంలో ఉన్నట్లే అనిపిస్తుంది.

వెళ్లిన రోజు కొంత విశ్రాంతి తీసుకుని ఊరిలో తిరగడానికి బయలుదేరారు ప్రకాశం

నిర్మల, అనిల్‌లు. మర్నాడు కూడా పోర్టుబ్లెయిర్, అక్కడ చూడవలసిన విశేషాలు చూడడంలో సరిపోయింది. మూడోరోజున ముగ్గురూ నికోబార్ దీవికి ముఖ్యపట్టణమైన కార్‌నికోబార్‌కి వెళ్లారు.

నికోబార్ చాలా అందమైన ద్వీపం. దానికి సమీపంలో కొన్ని వందల చిన్న చిన్న ద్వీపాలున్నాయి. వాటిలో అత్యధికమైన వాటిలో జనవాసం లేదు. అయితే కొన్నింటికి కార్‌నికోబార్ నుంచి మోటార్ బోటులో సరదాగా వెళ్లిరాగల సదుపాయం ఉంది. డ్రైవింగ్ తెలిసిన వాళ్ళయితే తగిన రుసుము చెల్లించి సొంతంగా నడుపుకుంటూ వెళ్లి రావచ్చు.


ప్రకాశానికి మోటార్ బోట్ డ్రైవింగ్ వచ్చు. మొదట్లో అతను ఉద్యోగం చేసింది నేవీలోనే. ఆ తర్వాత అందులో రిటైర్మెంట్ తీసుకొని ఒక మంచి ప్రయివేట్ కంపెనీలో ఆకర్షణీయమైన ఆఫర్ వస్తే అందులో రీజియనల్ మేనేజర్‌గా చేరాడు.

ప్రకాశం తన ఐడెంటిటీ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు మొదలైనవి చూపించి రుసుము చెల్లించి ఒక మోటారు బోటును అద్దెకు తీసుకున్నాడు.

అప్పటికి ప్రొద్దున తొమ్మిది గంటలయింది. సాయంత్రానికల్లా తిరిగి వచ్చేయాలి. వెళ్ళవలసిన మార్గం, మారం ముందే నిర్దేశించబడి వుంటాయి కనుక గస్తీ పడవలు, అటువంటి అద్దె పడవలన్నింటినీ ఓ కంట కనిపెట్టుతూనే ఉంటాయి.

* * *

ఆకాశం నిర్మలంగా ఉంది. అక్కడక్కడ తెల్లని మబ్బులు దూది పింజల్లా



తేలియాడుతున్నాయి. చల్లని సముద్రపు గాలి ఒంటికి తగిలి పరవశింపజేస్తోంది.

ప్రకాశం వాళ్ళున్న మోటారు బోటు రయ్యిమంటూ సముద్రంమీద పరుగులు తీస్తోంది. దూరాన్నించి చూస్తే తెల్లని రాజహంస నీటిమీద తేలియాడుతున్నట్లుగా అనిపిస్తోంది.

పదకొండు గంటలపరకు సముద్రంలో షికార్లు కొట్టి దగ్గర్లో కనిపిస్తున్న ఒక చిన్న ద్వీపాన్ని జేరి, అక్కడ జెట్టీదగ్గర మోటార్ బోటుకు లంగరు వేసాడు ప్రకాశం.

అది ఒక చిన్న ద్వీపం. సుమారు మూడు పదరపు కిలోమీటర్ల వైశాల్యం ఉంటుంది. మధ్యలో ఒక చిన్న గుట్టలాంటి కొండ ఒకటి ఉంది. అది మన విజయవాడ కొండల్లాగా బోడికొండ. అంటే దానిమీద అక్కడక్కడ చిన్న చిన్న తుప్పలేకానీ పెద్ద చెట్లేవీ లేవు. మట్టూ నేలకూడా గరుకుగా ఉండడంతో తీర ప్రాంతాల్లో పెరిగే గడ్డీ, ముళ్ళ దుబ్బులూ తప్ప వేరేమీ లేవు. అయితే అక్కడో విశేషం ఉంది. అది ఆ చిత్రాలు వున్న ప్రత్యేకమైన గుహ. ఆ గుహ గోడలమీద కొన్ని చిత్రాలు— వింత వింత జంతువులు, ఛాయామయంగా స్పష్టంగా వున్న ఆదిమజాతి మానవుల రూపాల వంటివి ఉన్నాయి. అవి సుమారు ఏడెనిమిదివేల సంవత్సరాల క్రితం అక్కడ నివసించిన ఆదిమజాతివారు గీసిన చిత్రాలని పురాతత్వ శాఖవారు అంచనా వేసారు. అందువల్ల ఆ గుహ చిత్రాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కళల విషయాలలో ఆసక్తి వున్న విదేశ యాత్రికులు వాటిని చూడడానికి అక్కడికి తప్పకవస్తారు. అదీకాక అక్కడికి జేరేసరికి 11–12 మధ్య అవుతుంది కనుక అక్కడ లంచ్ తీసుకొని కాసేపు విశ్రాంతి తీసుకో డానికి అనువుగా ఉంటుంది. అక్కడ టూరిస్టుల కోసం కట్టిన రెస్టు హవుస్, కాన్‌టీన్ కూడా ఉన్నాయి.

ప్రకాశం, నిర్మల, అనిల్ ఆ ద్వీపం మధ్యనున్న గుట్ట ఎక్కారు. ఎటు చూసినా సముద్రం. అక్కడక్కడ నీటిలో ఈదులా డుతున్న గేదెలలాగా ద్వీపాలు లీలగా కనిపిస్తు న్నాయి. విమానంలోంచి చూస్తుంటే క్రిం ద అంతా సముద్రం— ఇప్పుడు అన్నివైపులా సముద్రం. అదోరకం అనుభూతి— ఇదోరకం అనుభూతి. అంతా విభ్రాంతి. దేని ప్రత్యేకత దానిదే. ఏదీ మరచిపోలేనిది.

గుహలో కేవ్‌మాన్స్ పెయింటింగ్స్ చూశాక ముగ్గురూ ద్వీపం అంతా ఓ రౌండ్ కొట్టి వచ్చారు. ఆ తర్వాత రెస్టుహౌస్ చేరుకుని భోజనం పూర్తి చేసారు. ఒక్క అరగంట విశ్రాంతి తీసుకుని మళ్లీ మోటా ర్ బోట్‌లో బయలుదేరారు.

మోటార్ బోటు వేగంగా సముద్రపు నీటిని చీల్చుకుంటూ ముందుకి రయ్యిమని వెళ్లిపోతోంది. కొంచెం సేపట్లోనే అన్నివైపు లా సముద్రం తప్ప తీరంకాని, వేరే ఏ ద్వీపం కాని కనిపించకుండా పోయాయి.

బంగాళాఖాతంలో ఒక విశేషం ఉంది. ఆకాశం నిర్మలంగా ఉండగానే ఉన్నట్లుండి అల్పపీడనం ఏర్పడుతుంది. దాంతో అన్నివై పుల నుంచి గాలులు, దట్టమైన మబ్బులు వచ్చి చూస్తుండగానే ప్రచండమైన గాలి వాన, తుఫాను వస్తుంటాయి.

ఆరోజు అనుకోకుండా అటువంటి పరిస్థితులే ఏర్పడ్డాయి. ఉన్నట్లుండి ఈదరుగాలి ప్రారంభమయింది. ఈదురుగాలి వేరు, చల్లనిగాలి వేరు. చల్లనిగాలి వంటికి హాయిని కల్పిస్తుంది.

ఇంతలో ఎక్కడినుంచి వచ్చాయో నల్లని మబ్బులు అన్నివైపులనుంచీ వస్తూ దట్టంగా కమ్ముకోసాగాయి.

''ఏమండీ గాలి వచ్చేటట్లుంది. తిరిగి వెళ్లిపోదాం పదండి'' అంది నిర్మల ఆందోళనగా.

అనిల్‌కి ఒకప్రక్కన భయం వేస్తున్నా, ఆ వింత అనుభవం ఆసక్తిని కల్పిస్తోంది.

''అవును నిజమే వెళ్ళిపోదాం'' అంటూ మోటారు బోటును వెనక్కి తిప్పాడు ప్రకాశం. అది వాలుగాలి కావడంతో మోటారు బోటు మరింత వేగంగా దూసుకుపోసాగింది. ఒక్కొక్కసారి ఆ వేగానికి నీటిమీద లేడిలా ఎగిరి ముందుకు పడుతోంది. ఆ గాలి జోరుకి బోటును కంట్రోలు చేయడం కష్టమవుతోంది.

మరికొంచెం సేపట్లోనే జోరున కుండపోతగా వర్షం ప్రారంభమైంది. దానికితోడు భయంకరంగా శబ్దం చేస్తూ సుళ్ళు సుళ్ళుగా తిరుగుతున్న పెనుగాలి. దానిమూలంగా ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలమీద ఎగిరెగిరి పడుతూ గుండ్రంగా గిరికీలు కొట్టడం మొదలుపెట్టింది మోటారు బోటు.

ఆ ముగ్గురికి ప్రాణాలమీద ఆశపోయింది. ఏరికోరి మృత్యువు పిలిస్తే వెతుక్కుంటూ ఈ అండమాన్స్‌లో దిక్కుమాలిన చావు చావడానికి వచ్చినట్లు అనిపించింది. కానీ కంగారుపడిపోతే బోటు నడపడం మరింత కష్టం అవుతుందని, లోపల ఎంత ఆందోళనగా వున్నా పైకి కనిపించనీయక, గోలచేయక అత్యంత సంయమనాన్ని ప్రదర్శించారు నిర్మల, అనిల్.

ప్రకాశం గంభీరంగా, ఏమీ మాట్లాడకుండా దృష్టినంతా బోటుమీదనే కేంద్రీకరించి నడపసాగాడు. మరికొంచెం సేపట్లో కొంత దూరంలో ఒక ద్వీపం, దాని మధ్యనుంచి పొడుచుకొచ్చిన ఒక కొండా కురుస్తున్న వానలోంచి మసక మసకగా కనిపిస్తున్నా



## టైటిల్

ఒక పత్రికకు కథ పంపిస్తూ – "నా కథకు టైటిల్ మీకు నచ్చకపోతే మార్చవచ్చు" అని రాశాడు వినానందం.

వెంటనే కథ తిరిగొచ్చింది. దాంతోపాటు ఓ ఉత్తరం —

"మాకు కేవలం టైటిల్ నచ్చింది. దాన్ని వేరే కథకు ఉపయోగిస్తున్నాం. కృతజ్ఞతలు. —ఎడిటర్.

—వేణు (మన్నారిపురం)

యి. అల్లంత దూరంలో నేల కనిపించడంతో ప్రాణం లేచి వచ్చినట్లయింది. ముందుగా అక్కడికి చేరుకుంటే ప్రాణాలు నిలబడతాయి. ఆ తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చు.

అతి కష్టంమీద ఆ ద్వీపం వైపు బోటును మరల్చాడు ప్రకాశం. వాలుగాలి జోరుగా వస్తుండడంతో రివ్వున వెళ్లిపోతోంది బోటు. కొంచెంసేపట్లో వెనకవైపునుంచి పరుగువెళ్ల మంచి ఈలవేస్తున్నట్లు శబ్దం రాసాగింది. అది అంత కంతకూ ఎక్కువ కాసాగింది.

ఆ శబ్దంతోపాటు సముద్రంలో ఏదో అల్లకల్లోలం అయినట్లుగా ఉన్నట్లుండి ఒక పదిమీటర్ల ఎత్తుగల అల ప్రచండవేగంతో వెట్టుకు వచ్చింది. ఆ అలవచ్చి విరుచుకుపడడంతో బోటుమీద కంట్రోలు తప్పిపోయింది. అసలు ఏమి జరిగిందో అర్థం అయ్యేలోపలే అమిత వేగంతో వచ్చిన అలలో కొట్టుకుపోయింది బోటు.

అలా ఆ మహా అలతోపాటు అమితవేగంగా వెళ్లిన ఆ బోటు ఎదురుగుండా ద్వీపం మీదున్న కొండకి బలంగా గుద్దుకుంది. అంతే. మరు క్షణంలో తునాతునకలై పోయింది.

* * *

కళ్ళు తెరిచి చూసేసరికి నీటిమీద తేలియాడుతున్నట్లనిపించింది అనిల్‌కి. ఎండకి ఒళ్లు చిట చిటలాడుతోంది. ఎటు చూసినా సముద్రం.

అంతకు ఎంతో అల్లకల్లోలంగా ఉండిన ఆ సముద్రం ఏమీ ఎరగనట్లు మామూలు అలలు తప్ప ప్రశాంతంగా ఉంది.

అసలు ఏమి జరిగిందీ అర్థం కాలేదు అనిల్‌కి. తాను ఎక్కడ ఉన్నదీ తెలియలేదు. తాము వెళ్తుండిన మోటారు బోటు పగిలిపోవడం గుర్తుకి వచ్చింది. అమ్మా, నాన్న జ్ఞాపకం వచ్చేసరికి భయంతో ఒళ్లు బిగుసుకుపోయింది.

బిగ్గరగా "అమ్మా... నాన్నా..." అని అరిచాడు. ఆ అరుపులు గాలిలోనే కలిసిపోయాయి. కట్టలు తెంచుకున్నట్లు ఏడుపు రాసాగింది. కష్టంమీద ఆపుకున్నాడు.

అసలు తాను ఎక్కడ ఉన్నాను అన్న ఆలోచన వచ్చింది అతనికి. ఎటు చూసినా నీళ్ళే. మరి ఆ నీటిమీద తాను ఎలా ఉండగలిగాను అన్న అనుమానం వచ్చింది. మెడ ప్రక్కకు వంచి చూశాడు. ఏదో పెద్ద బల్లవంటి దానిమీద పడుకుని ఉన్నట్లనిపించింది. అది విరిగిపోయిన తమ మోటారు బోటులోని ఒక చెక్క కాదుకదా!

ఉన్నట్లుండి ఆ చెక్క పైకి లేస్తున్నట్లనిపించింది.

అది చెక్కకాదు. బ్రహ్మాండమైన తిమింగలం!

అది పైకిలేచి పిచికారిలోనుంచి నీటిని వదిలినట్లు పెద్ద శబ్దంచేస్తూ నోటితో నీటిని వదిలింది. ఆ తర్వాత మళ్లీ దేహం పై భాగం ఇంచుమించు నీటి మట్టానికి సమంగా ఉండేట్లుగా కిందికి వెళ్లింది.

అంటే తాను అంతసేపూ ఉన్నది తిమింగలం వీపు మీదనన్న మాట! ఆ వాస్తవం గుర్తించగానే భయంతో రక్తం గడ్డకట్టుకుపోయింది అనిల్‌కి. బిగ్గరగా అర

వాలనుకున్నాడు. కాని భయంతో నోరు పెగల్లేదు. కాళ్లూ చేతులూ అచేతనమైపోయాయి. ఏం చేయాలో తోచలేదు.

కొంచెం సేపటికి కొంత దూరంలో నీటిమీద నురగలు నురగలు ఉన్నట్లుగా కనిపించింది.

తిమింగలం ఆ నురగలవైపు దూసుకుపోసాగింది.

దాంతో ఆ నురుగలలో కల్లోలం వచ్చి అలజడి ప్రారంభమైంది.

తిమింగలం మహా వేగంతో అటు వెళ్లసాగింది.

మరికొంత దూరం వెళ్లేసరికి ఆ నురగలు ఏమిటో అర్థం అయింది అతనికి.

అవన్నీ పెద్ద పెద్ద నీటి తాబేళ్ళు. ఒక్కొక్కటి సుమారు నాలుగడుగుల వైవారం కలిగి ఉంది. వాటిని స్వాహా చేయడానికే తిమింగలం వెళ్తోంది.


ఏమి చెయ్యాలా అని అనిల్ ఆలోచిస్తుండగానే ఒక పెద్ద తాబేలును కటుక్కున నోట కరుచుకుంది తిమింగలం. ఆ అదను చూసి తన ప్రక్కనుంచే వెళ్తున్న ఒక పెద్ద తాబేలు మీదికి జరిగిపోయి దానిని గట్టిగా పట్టుకున్నాడు అనిల్.

ఈ హఠాత్సంఘటనకు తాబేలు బెదిరింది. తిమింగలానికి దూరంగా వేగంగా వెళ్లిపోసాగింది.

సముద్ర తాబేళ్ళు నీటిలో ఎక్కువ దూరం పోవట. అవి ఉన్నాయంటే తీరం సమీపంలోనే ఉంది అని అర్థం. ఎప్పుడో ఏదో పుస్తకంలో చదివిన విషయం గుర్తుకు వచ్చింది అనిల్‌కి. కొంచెం సేపట్లో అతను ఊహించినట్లుగానే కొంచెం దూరంలోనే ఒక ద్వీపం కనిపించసాగింది. దానిమీద కొండలు లేవు. అందువల్లనే బాగా దగ్గరికి వస్తేనేకాని కనిపించలేదు.

తీరం దగ్గరికి రాగానే అనిల్ తాబేలును వదిలి నీటిలోకి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు వెళ్లిపోయాడు. ఒడ్డు చేరాక భయంతో ఏకబిగిన పరుగెత్తి అలసట వచ్చాక ఆగిపోయాడు.

అప్పటివరకు ప్రాణభయం. ఇప్పుడు ఆ భయంపోయాక ఎక్కడలేని నీరసం అలముకుంది. ఆకలి పట్టి పీడించసాగింది. అమ్మా



## భళారే... మనిషి!

మన కన్ను కనీసం 17 వేల రకరకాల రంగుల్ని గుర్తించగలదు! మన చర్మంలోని ప్రతి చదరపు అంగుళంలోనూ 19 మిలియన్ల కణాలు, అరవై వెంట్రుకలు, 90 తైలగ్రంథులు, 19 అడుగుల రక్తనాళాలు, 625 స్వేద గ్రంథులు, 19 వేల సెన్సరీ కణాలు ఉంటాయి. ఏ రకంగా చూసినా... మన శరీరం ఓ అద్భుత జీవయంత్రమే!

—జూపిటర్

నాన్నా మళ్లీ జ్ఞాపకానికి వచ్చారు. వాళ్లు ఏమయ్యారో ఏమో! సముద్రానికి బలి అయిపోయారో లేదా తనలాగే ఎక్కడికైనా కొట్టుకుపోయారో! ఇద్దరూ కలిసే ఉన్నారో ఎవరికివారు విడిపోయారో! అన్నీ ప్రశ్నలే. దేనికీ సమాధానం దొరకదు.

బిగ్గరగా ఏడవాలనిపించింది అనిల్ కి. కాని అండమాన్స్‌లోని కొన్ని ద్వీపాలలో ఆదిమజాతులు, నరమాంసభక్షకులు ఉంటారని నాన్నగారు చెప్పిన విషయం గుర్తుకి వచ్చింది. అందువల్ల తాను నోరు మెదపకూడదు. జాగ్రత్తగా సంచరిస్తూ అక్కడ ఎవరైనా ఉన్నారో లేదో తెలుసుకోవాలి. ఆ తర్వాత తాను అక్కడ చిక్కుకుపోయిన సంగతిని ఎలాగైనా బయటి ప్రపంచానికి తెలియజేయాలి. ఆ ద్వీపం మీద ఆహారం ఏమైనా దొరికితే తిని ఆకలిని తీర్చుకోవాలి.

ఓపికను కూడగట్టుకుని లేచాడు అనిల్. నెమ్మదిగా ఆ ద్వీపం మీద తిరగడం మొదలుపెట్టాలి.

అది చాలా చిన్న ద్వీపం. అయితే అదృష్టవశాత్తూ దానిమీద కొబ్బరిచెట్లున్నాయి. అవి కూడా పొట్టిరకాలు. కాయలు చేతికి అందేటంత ఎత్తులో ఉన్నాయి. రెండు కొబ్బరికాయలు కోసుకున్నాడు. వాటిని కొండరాళ్లకేసి కొట్టాడు. అవి లేత కాయలు కావడంతో తేలిగ్గానే పగిలాయి. ఆ నీళ్లు తాగి లేత కొబ్బరి తిన్నాడు. ఆకలి, దాహం తీరడంతో ప్రాణం లేచివచ్చినట్లయింది.

చేతికున్న వాచీ చూసుకున్నాడు అనిల్. అది ఆటోమేటిక్ వాచ్ కావడంతో ఆగిపోకుండా టైం చూపిస్తోంది. తారీఖు ముల్లు 12 మీద ఉంది. తాము బోట్‌లో పిక్నిక్‌కి బయలుదేరింది 11న. అంటే క్రిందటి రోజున. సమయం 10 గంటలు చూపిస్తోంది. అంటే సుమారు ఒకరోజుపాటు అచేతనంగా సముద్రంలో కొట్టుకు వచ్చాడన్నమాట. మరి తిమింగలం వీపుమీదికి ఎలా చేరినట్టు?

ఏమో! మనుష్యులను తినివేసే తిమింగలం తన ప్రాణాలను కాపాడడం ఎంతో విచిత్రం! అంతా భగవంతుని దయ కాకపోతే నడి సముద్రంలో పడిపోయిన తాను బ్రతికి బయటపడ్డమేమిటి! అమ్మా నాన్నా కూడా ఇలాగే బ్రతికి బయటపడితే ఎంత బాగుంటుంది! అంతేకాదు తాను వాళ్లను కలుసుకోవాలి ఎలా? ఎక్కడ?

నెమ్మదిగా లేచి ఆ ద్వీపం మీద జాగ్రత్తగా తిరగసాగాడు అనిల్. అది చాలా చిన్న దీవి. దాని వైశాల్యం గట్టిగా నాలుగు కిలోమీటర్లు కూడా ఉండదు. దానిమీద ఎవరూ ఉన్నట్లు లేదు.

అయితే అక్కడక్కడ కొట్టి పడవేసిన కొబ్బరికాయలు ఉన్నాయి. అవతలివైపు తీరం మీద కొన్ని ఖాళీ విస్కీసీసాలు కనిపించాయి. అంటే అప్పుడప్పుడు అక్కడికి ఎవరైనా వస్తుంటారన్నమాట. వాళ్లు చేపల పడవలవాళ్లో, పిక్నిక్‌కి వచ్చేవారో ఎవరైనా కావచ్చుననిపించింది అనిల్ కి. ఆ లెక్కన అదృష్టం బాగుంటే ఎవరైనా త్వరలోనే వచ్చి తన ప్రాణాలు కాపాడవచ్చు. తాను బ్రతికి బట్టకట్టే యోగం ఉంది కనుకనే ఇప్పటివరకూ బ్రతికాడో యేమో!

ద్వీపానికి మరోవైపున కొంచెం దట్టంగా చెట్లు ఉన్నాయి. అక్కడికి వెళ్లాడు అనిల్. చెట్ల అవతల ఏవో మాటలు— ఏదో అలికిడి అవుతున్నట్లు అనిపించింది. వాళ్లు మామూలు మనుషులో— నరమాంస భక్షకులో— ఆ విషయం తెలుసుకోందే ముందుకి వెళ్లడం మంచిది కాదు. జాగ్రత్తగా నేలమీద బల్లిలా పాకుతూ ముందుకి వెళ్లాడు అనిల్. నెమ్మదిగా వెళ్లి ఒక పెద్ద చెట్టు వెనకాల నక్కాడు.

అవతలివైపున నలుగురు మనుష్యులు తీరం మీదికి ఏవో పెట్టెలు దించుతున్నారు కొంచెం దూరంలోనే ఒక ట్రాలర్ కన్పిస్తోంది. వారు దానిలోనే వచ్చారన్నమాట

చెట్టు చాటునుంచి వాళ్ళని జాగ్రత్తగా గమనించ సాగాడు అనిల్.

మంచి దుస్తుల్లో వున్న ఇద్దరు ఆ పెట్టెల్ని తెరిపిస్తున్నారు. ఒక దాంట్లో తెల్లని పొడివున్న ప్లాస్టిక్ పాకెట్లు ఉన్నాయి. మరో దాంట్లో బంగారు కడ్డీలు, బిస్కట్లు ఉన్నాయి. పేపర్లలో చదవడం, టి.వి.లో చూడడం వల్ల ఆ పొడి హెరాయిన్ అని ఇట్టే అర్థమయిపోయింది అనిల్ కి. వీళ్ళంతా స్మగ్లర్స్. ఈ దీవిని తమ దొంగ కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారన్నమాట. తాను అంతకుముందు చూసిన విస్కీ సీసాలు వీళ్ళో, వీళ్లలాంటి వాళ్లో ఉపయోగించినవై ఉంటాయి. తాను వీళ్ల కంటపడితే ప్రమాదం.

కొంచెం సేపట్లోనే వాళ్లు సరుకుని సర్దుకుని తాము వచ్చిన ట్రాలర్‌లోనే వెళ్లిపోయారు. సాయం చేయగల మనుష్యులు దగ్గర వుండీ, వాళ్ల సాయం పొందలేని తన దురదృష్టానికి విచారించాడు అనిల్.

వాళ్లు వెళ్లిపోయాక ఒక ఆలోచన వచ్చింది అనిల్ కి. అక్కడవున్న ఎండిపోయిన కొబ్బరి ఆకులు రెండు తీసుకొని వాటిమీద బాల్‌పెన్‌తో తన వివరాలు, తాను ఎక్కడో తెలియని ద్వీపంలో చిక్కుకుపోయిన విషయం, అక్కడ స్మగ్లింగ్ కార్యక



లాపాలు జరుగుతుండిన వైనం రాసి ఒక ఖాళీ విస్కీ సీసాలో పెట్టి మూత గట్టిగా బిగించాడు.

తర్వాత దానిని బలంగా సముద్రంలోకి విసిరాడు. అది అలలమీద తేలుతూ గాలివాటుకి ఎటో దూరంగా వెళ్లిపోయింది. భారమంతా భగవంతుడిమీద వేసాడు.

ఆ తర్వాత తన షర్టు తీసి ఒక కర్రకు కట్టి గాలిలో ఊపసాగాడు. అది అటునుంచి పోయే ఏ ఓడలోని వారికంటకాని, పైనుంచి ఎగిరే విమానం కంటకాని పడుతుందేమోనని ఆశ.

* * *

కళ్లు తెరిచి చూసేసరికి ప్రకాశం, నిర్మలకి చుట్టూ ఎందరో ఆదిమజాతివారు వింతగా చూస్తూ కనిపించారు. వాళ్ళు కళ్ళు తెరవగానే వారిలో వారు ఏదో మాట్లాడుకోసాగారు. ఇద్దరూ నెమ్మదిగా కూర్చుని తాము ఎక్కడ ఉన్నామని సంజ్ఞలతో అడిగారు. వారు ఏదో సంజ్ఞలతో సమాధానం చెప్పారు. కాని అదేమిటో వారికి అర్థం కాలేదు.

అంతలో ఒక పెద్ద ఆయన వింత దుస్తులతో, నెత్తిమీద ఈకల టోపీతో వచ్చాడు. అతను బహుశా ఆ ప్రజల పెద్ద కాబోలు. ఆయన రాగానే అక్కడ మూగిన వారు తప్పుకుని దారి ఇచ్చారు. ఆయన ప్రకాశాన్నీ, నిర్మలనీ చూస్తూ ఏదో అడిగాడు. అదేమిటో వారికి అర్థం కాలేదు.

ఆ తర్వాత అతను తన జాతివారికి ఏదో చెప్పాడు.

వెంటనే వాళ్లు వాళ్లిద్దర్నీ లేవమని సంజ్ఞ చేసారు.

వాళ్లు లేవగానే వెంట వుండి ఎక్కడికో నడిపించుకుపోయారు.

కొంచెం దూరంలోనే ఒక దేవాలయం వంటిది ఉంది. అందులో భయంకరమైన కాళికమ్మవారి వంటి కొయ్య విగ్రహం ఒకటి ఉంది.

ఆ విగ్రహం ముందు ఆ ఇద్దర్నీ నిలబెట్టారు వాళ్లు.

ఆ దేవతకు తమను బలి ఇస్తారని భయపడ్డారు ప్రకాశం, నిర్మల. అసలే అనిల్ ఏమయ్యాడోనని దిగులుపడ్తున్న వారికి ఈ ఉత్పాతం మిన్ను విరిగి మీదపడ్డట్లయింది.

* * *

ఆకాశంలో మిల మిల మెరుస్తూ చక్కర్లు కొడ్తోంది హెలికాప్టర్. క్రింద నేలమీద నుంచి గుడ్డ ఊపుతున్న అనిల్ దాని కంటపడ్డాడు.

హెలికాప్టర్ నెమ్మదిగా నేలని సమీపించింది. సుమారు ఒక ఇరవై అయిదు అడుగులు ఎత్తున ఉండగానే అందులోంచి త్రాటి నిచ్చెన కిందికి దిగింది. దానిని పట్టుకుని జాగ్రత్తగా హెలికాప్టర్‌లోకి వెళ్లాడు అనిల్.

ఆ ద్వీపంలో అమ్మవారి విగ్రహం ముందు ఏవో పూజలు జరుగుతున్నాయి. ప్రకాశం, నిర్మలకి బొట్లు పెట్టి మెళ్లో దండలు వేసారు. వారందరూ కూడా బొట్లు పెట్టుకున్నారు.

ఇంతలో అక్కడికి తెల్లని గౌను, వల్లని గడ్డం వున్న ఒక క్రైస్తవ ఫాదర్ వచ్చాడు. ఆయన్ని చూడగానే ఆదిమజాతివారు గౌర

వంగా నమస్కరిస్తూ ప్రక్కకి తొలిగారు.

ఆయన ఇంగ్లీషులో ప్రకాశంతో మాట్లాడాడు. తన పేరు రెవరెండ్ జాన్సన్ అనీ, ఆ దీవిలో మిషన్ నడుపుతున్నానని చెప్పాడు

తమ సంగతంతా క్లుప్తంగా ఆయనకి చెప్పాడు ప్రకాశం. ఆయన ఆదిమజాతివారికి ఏదో చెప్పాడు. వెంటనే వాళ్లు జాన్సన్‌కీ, ప్రకాశం దంపతులకీ నమస్కరించి వెళ్లిపోయారు.

తర్వాత రెవరెండ్ జాన్సన్ వారిద్దర్నీ తన కాటేజ్‌కి తీసుకువెళ్లాడు. అక్కడే వారికి స్నానాలకీ, భోజనాలకీ ఏర్పాటుచేసాడు. ఈలోగా వైర్‌లెస్‌లో కార్‌నికోబార్‌తో మాట్లాడాడు. అది అక్కడ నుంచి ఎక్కువ దూరం కాదట.

మరో రెండు గంటల్లో హెలికాప్టర్ వచ్చి ప్రకాశంను, నిర్మలను పికప్ చేసుకుంది. ఫాదర్ జాన్సన్ దగ్గర సెలవు తీసుకుని వారు సంతోషంగా వెళ్లిపోయారు. అయితే అనిల్ గురించే వారి దిగులు. ఆ విషయం హెలికాప్టర్ పైలెట్‌కి చెప్పారు వారు. పెర్రి పార్టీ ఆ తుఫానులో చిక్కుకుపోయిన వారి గురించి హెలికాప్టర్‌లో బయలు దేరిందనీ, వారు అంతటా గాలిస్తున్నారనీ చెప్పాడు.

అనిల్ కార్‌నికోబార్ చేరేసరికి అప్పటికే ప్రకాశం, నిర్మలా అక్కడ ఉన్నారు. అనిల్ సజీవంగా రావడం చూసి తమ కళ్ళను తాము నమ్మలేకపోయారు వారు. ఇద్దరూ ఎదురువెళ్లి కొడుకుని గాఢంగా వాటేసుకున్నారు. ఆ ముగ్గురి ఆనందానికే అవధులు లేవు. ఆ దృశ్యం చూసిన అందరికీ కళ్లు చెమర్చాయి.


ఎప్పుడైతే ప్రకాశం నడుపుతుండిన మోటారు బోటు గల్లంతు అయిందో, దానికోసం పెర్రి పార్టీ బయలుదేరింది.

అయితే రెవరెండ్ జాన్సన్ ఇచ్చిన సమాచారం మూలంగా ప్రకాశం, నిర్మలను రక్షించడం సులువయింది. అనిల్ తెలివిగా కర్రకి కట్టిన గుడ్డను ఊపుతుండడం వల్ల హెలికాప్టర్ అతన్ని గుర్తించడం సులభమయింది.

అనిల్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రొసీడ్‌చేసి అకస్మాత్తుగా దాడిచేసి స్మగ్లర్స్ ముఠాని అరెస్టు చేయగలిగారు కస్టమ్స్ అధికారులు.

సముద్రంమీద కలిగిన భయంకరమైన అనుభవంతో తిరుగు ప్రయాణాన్ని కూడా విమానంలోనే చేసి క్షేమంగా స్వగృహం చేరుకున్నారు ఆ ముగ్గురూ.

*




"సినిమా కెళ్తున్నాను వస్తావా?" అడిగాడు రవి రాముని.

"ఆ. వస్తాను" అన్నాడు రాము.

"అయితే నా టిక్కెట్టు కోసం కూడా డబ్బులెక్కువ తీస్కురా" చెప్పాడు రవి.

—ఎస్.ఎం.అహమద్ (ఏలూరు)